# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 09-11-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **విజయవాడ పున్నమిఘాట్ నుంచి సీ ప్లేన్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో కలిసి ఈ రోజు ప్రారంభించారు.**

**2.** **మాదక ద్రవ్యాల కట్టడికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అవసరమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.**

**3.** **రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలను తీసుకుంటోందని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.**

**4.** **సంక్రాంతి నాటికి రాష్ట్రంలో రహదారుల మరమ్మతు పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు.**

**5.** **ఈరోజు జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

కేంద్ర పౌరవిమానయాన శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న 'స్కై మీట్స్ సీ' పేరుతో చేపట్టిన సీ ప్లేన్ కార్యక్రమాన్ని విజయవాడ ప్రకాశం బ్యారేజీ పున్నమిఘాట్ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో కలిసి ఈరోజు ప్రారంభించారు. అంతకుముందు విజయవాడలో నిర్వహించిన ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ,

**వాయిస్ ( 40 సెకన్లు)**

సీ ప్లేన్ కార్యక్రమంపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ,

**వాయిస్ ( 30 సెకన్లు)**

మరోవైపు సీ ప్లేన్‌లో ప్రయాణించి ముఖ్యమంత్రి ఈరోజు శ్రీశైలానికి చేరుకొని శ్రీశైల మల్లికార్జున స్వామివారిని దర్శించుకుంటారు.

------------------------

రాష్ట్రంలో మాదకద్రవ్యాలు తీవ్ర సమస్యగా మారాయని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. మాదక ద్రవ్యాలు, గంజాయి సాగును అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దేశంలోని ఇతర ప్రాంతాలలో పట్టుబడిన మాదక ద్రవ్యాలకు రాష్ట్రంతో సంబంధాలు ఉండటం విచారకరమని అన్నారు. ఇటువంటి నేరాల కట్టడికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అవసరమని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో రహదారుల మరమ్మతు పనులు సంక్రాంతి నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. విజయవాడలోని ఆర్అండ్‌బీ కార్యాలయం నుంచి నిన్న జిల్లాల ఇంజినీర్లతో దృశ్యమాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఏయే జిల్లాల్లో రోజుకు ఎంతమేర రహదారుల మరమ్మతుల పనులు జరిగాయనే దానిపై రోజువారీ నివేదికలు అందజేయాలని అన్నారు. పనులను నాణ్యతగా చేపట్టాలని మంత్రి సూచించారు.

---------------------------

రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నెల్లూరులోని పెన్నానదిలో ఉన్న ఇసుక రీచులను ఈరోజు పరిశీలించి, ఉచిత ఇసుక పంపిణీ విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ,

**వాయిస్ ( 30 సెకన్లు)**

---------------------------

దేశంలో ప్రతీ ఒక్కరికీ సమన్యాయం అందించాలన్న ఉద్దేశంతో ఈరోజు జాతీయ న్యాయ సేవల దినోత్సవం నిర్వహిస్తున్నారు. న్యాయ వ్యవస్థకు సంబంధించి ప్రజలలో అవగాహన కల్పించడానికి ప్రతి ఏటా నవంబర్ 9వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. దేశంలో ఈ కార్యక్రమాన్ని మొదటిసారిగా 1995వ సంవత్సరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయపరమైన హక్కుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈరోజు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

విశాఖపట్నంలోని INS డేగా విమానాశ్రయంలో భారత భద్రతా దళాలు యాంటీ హైజాక్ విన్యాసాలను నిర్వహించాయి. హైజాక్ జరిగినపుడు ప్రతిస్పందించే విధానాలు, భద్రతా దళాల సామర్థ్యం వంటి అంశాలపై ఈ విన్యాసాలను నిర్వహించారు. దీనిపై మరింత సమాచారాన్ని విశాఖపట్నం నుంచి మా ఆకాశవాణి ప్రతినిధి వి. సత్యనారాయణ మూర్తి అందజేస్తారు.

**వాయిస్ ( 30 సెకన్లు)**

---------------------------

ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు పేరు పెట్టడం సంతోషంగా ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆయన గౌరవార్థం

ముఖ్యమంత్రి ఈ ప్రతిపాదనకు అంగీకరించారని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తెలిపారు. 'ఏలూరు ప్రభుత్వ కళాశాలకు ఎల్లాప్రగడ సుబ్బారావు పేరు ప్రతిపాదనను తీసుకొచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ధన్యవాదాలు' తెలిపారు.

---------------------------

ప్రతీ ఇంట్లో సౌర విద్యుత్ వినియోగించుకొనే విధంగా వినియోగదారులకు అవగాహనా కల్పించాలని నరసారావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయులు అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం అమలుపై ఆయన నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ దేవరాయులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

---------------------------

టి.బి.ముక్త్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం కోసం ప్రతి నెల అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని ఈనెల నుంచి వెయ్యి రూపాయలకు పెంచిందని ప్రకాశం జిల్లా క్షయవ్యాధి నివారణాధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ తెలిపారు. ఒంగోలులో ఈరోజు ఆయన మాట్లాడుతూ, క్షయ వ్యాధిగ్రస్తులు చికిత్స తీసుకున్నంత కాలం ఈ ఆర్థిక సహాయం అందజేస్తారని చెప్పారు. ఈ మొత్తం నేరుగా వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు.

---------------------------

కాకినాడ జిల్లాలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్. షన్‌మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలో ఈ రోజు, రేపు ఓటరు నమోదు శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉంటాయని, జాబితాలో ఓటు లేనివారు మళ్లీ నమోదు చేసుకోవచ్చని అన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండేవారు కొత్తగా ఫారం-6 ద్వారా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నమోదుతో పాటు తొలగింపులు, మార్పులు, బదిలీకి దరఖాస్తులు స్వీకరిస్తారమని తెలిపారు.

---------------------------

విద్యార్థుల కోసం చేపట్టిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ -అపార్ కార్డు నమోదు కోసం పాఠశాల సంబంధించిన పత్రాల్లో మార్పులు చేసే అధికారాన్ని ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, ఉపవిద్యాధికారులకు కల్పిస్తూ పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అపార్ నంబరుకు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతోపాటు పాఠశాల రికార్డుల్లోనూ విద్యార్థుల పుట్టిన తేదీ, పేరు, ఇతర వివరాలు ఒకేలా ఉండాలని తెలిపింది. ఒకవేళ సవరణలు ఉంటే పాఠశాల రికార్డుల్లో వాటిని సరిదిద్దేందుకు వచ్చే ఏడాది మార్చి 31 వరకు గడువు ఇస్తున్నట్లు పేర్కొంది.

---------------------------

పముఖ కవి, రచయిత దువ్వూరి రామిరెడ్డి జయంతి ఈరోజు. 1895 నవంబర్ 9వ తేదీన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో జన్మించిన ఆయన నలజారమ్మ, కృషీవలుడు, పానశాల వంటి ఎన్నో ప్రముఖ రచనలు చేశారు.

====================